క్లుప్తంగా

ప్రభుత్వ కళాశాలలో హరితహారం



మొక్క నాటుతున్న ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు

గోదావరిఖనిటౌన్: స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో జాతీయ సేవా పథకం (ఎన్‌ఎస్‌ఎస్) ఆధ్వర్యంలో శనివారం హరిత హారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో ఎన్‌ఎస్‌ఎస్ నిర్వాహకులు దామెర శంకర్, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పున్నం రజిత, వలంటీర్లు మొక్కలు నాటారు.

పేదలకు సాయం చేస్తాం



నియామక పత్రం ఇస్తున్న సత్యనారాయణ

కమాన్‌పూర్: నిరుపేద కుటుంబాలకు తమవంతుగా సాయం చేస్తామని కమాన్‌పూర్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సానా రామకృష్ణారెడ్డి అన్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన లయన్స్ క్లబ్ కార్యవర్గ ప్రమాణ స్వీకారం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి లయన్స్ క్లబ్ ఆఫ్ పెద్దపల్లి ఆధ్వర్యంలో లైన్ బండ బాబురావు ఆధ్వర్యంలో ప్రమాణస్వీకారం చేయించారు. ముఖ్య అతిథిగా వచ్చిన ఆర్టీసీ మాజీ చైర్మన్ మాట్లాడుతూ క్లబ్ ఆధ్వర్యంలో ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలతో పాటు నిరుపేదలకు సహాయ సహకారాలు అందించాలన్నారు. లయన్స్ క్లబ్ పెద్దపల్లి అధ్యక్షుడు సాదుల వెంకటేశ్వర్లు, జిల్లా గవర్నర్ లయన్ హనుమండ్ల రాజిరెడ్డి, నల్లవెల్లి శంకర్, డాక్టర్ విజయకుమార్, ఇనగంటి భాస్కర్‌రావు, శంకర్‌గౌడ్ పాల్గొన్నారు.

ఇసుక కాంట్రాక్టర్‌పై ఫిర్యాదు



పంట భూమిలోకి వస్తున్న వరద నీరు

ముత్తారం: మండలంలోని ఖమ్మంపల్లిలో మంథని రాజయ్య, కొరకాసుల కుంట వద్ద ఓ ఇసుక క్వారీ కాంట్రాక్టర్ మట్టి తీయడంతో వరద నీరు తమ భూమిలోకి రావడంతో పంట నష్టం జరిగిందని ఇరిగేషన్, తహసీల్దార్, పోలీసుశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు బాధిత రైతు పెట్టం రవి అవేదన వ్యక్తం చేశారు. ఇసుక కాంట్రాక్టర్ మట్టి తీయడంతో 5ఎకరాల భూమి సాగుకు నోచుకోవడం లేదని సంబంధిత కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. కుంటలో తీసిన మట్టి పూడ్చాలని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పరిశీలిస్తున్న తహసీల్దార్ రాంచందర్‌రావు

రామగిరి: మండలంలోని పన్నూర్, నాగేపల్లి, బేగంపేట్, లద్నాపూర్‌లలో గల పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ రాంచందర్‌రావు శనివారం పరిశీలించారు. అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేయనున్న పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించి సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట నాయబ్ తహసీల్దార్ రాకేశ్‌రెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజబాబు ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న ఎంపీపీ లక్ష్మి

కమాన్‌పూర్: మండలంలోని గుండారం గ్రామానికి చెందిన దండె కనుకయ్యకు రూ.18వేలు, రాసకొండ సరోజకు రూ.32వేల విలువ గల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు ప్రభుత్వం నుంచి మంజూరయ్యాయి. శనివారం ఎంపీపీ రాసకొండ లక్ష్మి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కిషన్ రెడ్డి, ఉపసర్పంచ్ రాసకొండ చంద్రమౌళి, నాయకులు రాసకొండ రవి, బొల్లపల్లి శంకర్ గౌడ్, గాదె సదయ్య, దామెర సంపత్, దండె కిషన్, భాస్కర్, బాలకృష్ణ పాల్గొన్నారు.

అధ్వానంగా అంతర్గత రోడ్లు

- దృష్టిసారించని అధికారులు, ప్రజాప్రతినిధులు
- తిప్పలు పడుతున్న ప్రజలు



గుంతలమయంగా మారిన సీసీరోడ్డు

రామగిరి: మండలంలోని ఆయా గ్రామాల్లో అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయి. కల్వచర్ల నుంచి లొంక కేసారం వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా ధ్వంసమైంది. ప్రధాన రోడ్డు ధ్వంసమై ఏళ్లు గడుస్తున్నప్పటికీ పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మండల ప్రజలు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కంకర తేలిన రోడ్డు..

రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు, కంకర తేలిన రోడ్డుతో రాకపోకలు పెద్ద సమస్యగా మారిందని వాహనదారులు వాపోతున్నారు. గుంతల రోడ్లపై ప్రయాణం తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోందని వాపోతున్నారు. రోడ్డు వేయాలని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా సమస్య పరిష్కారం కావడం లేదని, భారీ వాహనాలు నడవడంతో రోడ్లు పూర్తిగా చెడిపోయాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం కురిస్తే చాలు ఏ గుంత ఎక్కడ ఉందో గుర్తించలేక జారిపడిన ఘటనలు అనేకం ఉన్నాయి. ఎన్నిసార్లు అధికారులకు మొర పెట్టుకున్నప్పటికీ పట్టించుకొనే నాథుడే కరువయ్యాడని, ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అనేకసార్లు వినతిపత్రం ఇచ్చినం



కల్వచర్లలో రోడ్లు వేయాలని, డ్రైనేజీలు నిర్మించాలని అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదు. ప్రజావాణిలో గతంలో కలెక్టర్ దృష్టికి కూడా తీసుకువెళ్లాం. రోడ్డు బాగాలేదని సంబంధిత అధికారులకు, ప్రజా ప్రతినిధులకు అనేకసార్లు వినతిపత్రం ఇచ్చినం. – గంట పద్మ, సర్పంచ్

ఫొటోగ్రఫీ ఒక అద్భుతమైన కల



యైటింక్లయిన్‌కాలనీ: వేడుకల్లో సీఐ, ఫొటోగ్రాఫర్లు



మంథని: కేక్ కట్ చేస్తున్న చైర్‌పర్సన్ శైలజ

యైటింక్లయిన్‌కాలనీ: ఫొటోగ్రఫీ అనేది ఒక అద్భుతమైన కల అని గోదావరిఖని టూటౌన్ రెండో సీఐ అప్జలోద్దీన్ అన్నారు. యైటింక్లయిన్‌కాలనీ ఫొటో అండ్ వీడియోగ్రాఫర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ప్రెస్‌భవన్‌లో నిర్వహించిన అంతర్జాతీయ ఫొటోగ్రఫీ దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. సీనియర్ ఫొటోగ్రాఫర్లను, మహిళా ఫొటోగ్రాఫర్‌గా రాణిస్తున్న తులసిని సన్మానించారు.

మంథని: మంథనిలో ఫొటోగ్రాఫర్స్ దినోత్సవం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ కేక్ కట్ చేశారు. సీనియర్ ఫొటోగ్రాఫర్ తూర్పాటి సత్యనారాయణను సన్మానించారు.

పాలకుర్తి: మండల ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫొటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగ్‌రే చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

ధర్మారం: మండల కేంద్రంలో ఫొటో వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు ఎదుల్ల ప్రభాకర్ ఆధ్వర్యంలో శనివారం ఆర్యవైశ్య భవనంలో ఫొటోగ్రఫీ దినోత్సవం నిర్వహించారు.

జ్యోతినగర్: కాలాన్ని బంధించే శక్తి కెమెరాకు ఉందని రామగుండం సీఐ చంద్రశేఖర్‌గౌడ్ అన్నారు. రామగుండం, ఎన్టీపీసీ, ఎఫ్‌సీఐ, అంతర్గాం ఫొటో, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మేడిపల్లి సెంటర్ సమీపంలోని సాయి సేవాసమితి సామాజిక భవనంలో కెమెరా సృష్టికర్త లూయిస్ డాగ్‌రే చిత్రపటానికి నివాళి అర్పించారు.

సుల్తానాబాద్: మండల కేంద్రంలో ఫొటోగ్రఫీ సందర్భంగా సీనియర్ ఫొటోగ్రాఫర్‌లను సన్మానించారు. ఫొటో వీడియోగ్రాఫర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు తాళ్లపల్లి మనోజ్‌గౌడ్ పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్: మండల కేంద్రంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంచి పెట్టారు.

రామగిరి: మండల కేంద్రంలోని సెంటినరీకాలనీలో ఫొటోగ్రఫీ దినోత్సవం నిర్వహించారు.

ముత్తారం: ముత్తారంలో ప్రపంచ ఫొటో, వీడియోగ్రాఫర్ల దినోత్సవం జరుపుకున్నారు.

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద శనివారం లూయిస్ డాగ్‌రే చిత్రపటానికి నివాళి అర్పించారు.

కొవ్వొత్తుల ర్యాలీ

సుల్తానాబాద్: ఖమ్మం జిల్లాలో ఆశా కార్యకర్త విజయ విధుల నిర్వహణకు వెళ్తుండగా బస్సు కింద పడి మృతి చెందింది. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని శనివారం ఆశ కార్యకర్తలు మండల కేంద్రంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వం వారి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. ఆశా కార్యకర్తలు మమత, రమాదేవి, సుగుణ, కవిత, ప్రమీల, స్వప్న, విజయ ఉన్నారు.

క్షీరాభిషేకం

కాల్వశ్రీరాంపూర్: రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్ష రుణమాఫీ చేసిన సందర్భంగా మండల కేంద్రంలో పీఏసీఎస్ కార్యాలయంలో శనివారం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎంపీపీ నూనేటి సంపత్‌యాదవ్, పీఏసీఎస్ చైర్మన్ చదువు రాంచంద్రారెడ్డి సీఈవో కోలేటి శ్రీనివాస్, ఏఎంసీ మాజీ చైర్మన్ రాంచంద్రారెడ్డి, సర్పంచు గోనె శ్యాం, డైరెక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, సదయ్య, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

✦ నిరుపేదలకు దుప్పట్లు అందజేత

సుల్తానాబాద్: నిరుపేదలకు, దివ్యాంగులకు ఎంపీపీ బాలాజీరావు దుప్పట్లు పంపిణీ చేశారు. మండల కేంద్రానికి చెందిన కందుకూరి పెద్దన్న–పద్మ దంపతుల కుమారుడు కందుకూరి సాయినిఖిల్ పుట్టినరోజు సందర్భంగా శనివారం దివ్యాంగులు, నిరుపేదలకు అన్నదానం చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీతగౌడ్, మాజీ జెడ్పీటీసీ రమేశ్, స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు రవీందర్, సత్యనారాయణ, వెలుగు స్వచ్ఛంద సంస్థ లెక్కల నగేశ్, యువ సంకల్ప ఫౌండేషన్ సభ్యులు శెట్టి శ్రీనివాస్, ఎ.కిరణ్ పాల్గొన్నారు.

✦ డిజిటల్ విద్యాబోధన ఉపకరణాల బహూకరణ

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని మద్దిర్యాల ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలకు అదే గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ తాడూరి మహేశ్వరి రూ.20వేల విలువ చేసే డిజిటల్ విద్యాబోధనకు సంబంధించిన ఉపకరణాలు బహూకరించారు. ఇందులో ప్రొజెక్టర్, సౌండ్‌బాక్స్‌లు, కంప్యూటర్ ఉన్నాయి. అంగన్‌వాడీ టీచర్ నిర్ణయంపై పేరెంట్స్, ఉపాధ్యాయులు మహేశ్వరిని అభినందించారు. హెచ్‌ఎం.నంద రమేశ్‌కుమార్, ఎస్‌ఎంసీ చైర్మన్, సభ్యులు ఉన్నారు.

✦ మండలవ్యాప్తంగా ఎడతెరిపిలేని వర్షం

జూలపల్లి: మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో శుక్రవారం అర్ధరాత్రి నుంచి వర్షం ఎడతెరిపి లేకుండా పడుతోంది. మండలంలో గడిచిన 24 గంటల్లో 47.2 మీ.మీ వర్షపాతం నమోదైంది.

✦ ఐటీఐ మూడోవిడత సీట్ల భర్తీకి కౌన్సెలింగ్

రామగుండం: పట్టణంలోని ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ (ఐటీఐ)లో మూడోవిడత ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ ట్రేడ్స్‌లలో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయనున్నట్లు శనివారం ప్రిన్సిపాల్ సురేందర్ తెలిపారు. ఈ మేరకు వివిధ ట్రేడ్లలో సీట్లు పొందాలనుకునే విద్యార్థులు 30వ తేదీలోగా వెబ్‌సైట్ http:/iti.telangana.gov.in లో తమ ధృవీకరణపత్రాలను అప్‌లోడ్ చేయాలని సూచించారు.

✦ పిల్లలపై శ్రద్ధ వహించాలి

సుల్తానాబాద్‌రూరల్: పిల్లల ఇంటివద్ద చదువుకునేలా తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని హెచ్‌ఎం కోటేశ్వర్‌రావు కోరారు. సుల్తానాబాద్ మండలంలోని సుద్దాల ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం పాఠశాల అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉన్న నర్సరీ తొలగింపు, అటెండర్ నియామకం, సీసీ కెమెరాల ఏర్పాటు తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో ఎస్‌ఎంసీ చైర్మన్ బొంకూరి ఐలయ్య, వైస్ చైర్మన్ సరిత పాల్గొన్నారు.

✦ బీఎస్పీలో చేరిక

ఓదెల: మండలంలోని హరిపురం గ్రామంలో మాజీ ఎంపీటీసీ బీజేపీకి చెందిన మాటూరి సరిత, రవి బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష సమక్షంలో శనివారం చేరారు. బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి దాసరి హన్మయ్య, కోశాధికారి ఎండీ రియాజ్, మండలం నాయకులు నవీన్, మహేశ్ పాల్గొన్నారు.

✦ నాగెపల్లిలో ఎంపీవో విచారణ

రామగిరి: మండలంలోని నాగెపల్లి గ్రామంలో శనివారం మండల పంచాయతీ అధికారి భాస్కర్ విచారణ చేపట్టారు. ఆగస్టు 14న గ్రామానికి చెందిన మల్టీపర్పస్ వర్కర్ శనిగరపు బానయ్య తనను అకారణంగా విధుల నుంచి తొలిగించారని, సర్పంచ్ దుర్భాషలాడాడని ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై గ్రామంలో విచారణ చేశామని, పూర్తి నివేదికను ఉన్నతస్థాయి అధికారులకు నివేదించనున్నట్లు ఎంపీవో భాస్కర్ తెలిపారు.

✦ యాదవ మహాసభ విజయవంతం చేయాలి

ఓదెల: పెద్దపల్లి నందన గార్డెన్‌లో 23న జరిగే శతాబ్ది ఉత్సవాల సందర్భంగా జరిగే అఖిల భారత యాదవ మహాసభను విజయవంతం చేయాలని యాదవ సంఘం మండల అధ్యక్షుడు కావటి రాజు పేర్కొన్నారు. ఓదెలలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ మండలంలోని 22 గ్రామాల నుంచి యాదవ మహాసభకు తరలిరావాలన్నారు. అలాగే ఆదివారం మండలకేంద్రం ఓదెలలో యాదవ సమావేశం జరగుతుందని, ఈ సమావేశానికి జిల్లా నాయకులు వస్తున్నారని రాజు తెలిపారు.

✦ బాలిక మృతి కారకులను శిక్షించాలి

ఓదెల: పెద్దపల్లి మండలం అప్పన్నపేట శివారులో మధ్యప్రదేశ్‌కు చెందిన బాలిక మృతికి కారణమైన వారిని శిక్షించాలని అంబేద్కర్ సంఘం రాష్ట్ర కార్యదర్శి మాటూరి రత్నం పేర్కొన్నారు. కామాంధుల చేతిలో లైంగికదాడికి గురైన బాలిక కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. నిందితులపై కేసు నమోదు చేయాలన్నారు.

గో సంరక్షణ సామాజిక బాధ్యత



కరపత్రం ఆవిష్కరిస్తున్న జెడ్పీచైర్మన్ పుట్ట మధు

మంథని: దేశ సంస్కృతి సౌభాగ్యానికి ఆధారమైన గోవుల సంరక్షణ సామాజిక బాధ్యతగా గుర్తించాలని జెడ్పీచైర్మన్ పుట్ట మధు అన్నారు. తన నివాసంలో శనివారం కపిల గోశాల కరపత్రాలను మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజతో కలిసి ఆవిష్కరించారు. విశ్వానికి తల్లిలాంటి గోమాతను పూజించే సంస్కృతి మనదన్నారు. గోశాల నిర్వాహకుడు కోరబోయిన రమేశ్ ఉన్నారు.

పెద్దపల్లిలో కాషాయజెండా ఎగరేస్తాం



ముంబై వెస్ట్ ఎమ్మెల్యే నారాయణకు సన్మానం

పెద్దపల్లిరూరల్: రాష్ట్రంలో కేసీఆర్ అవినీతి పాలనను అంతమొందించేందుకు ప్రజలంతా నిర్ణయం తీసుకున్నారని, రానున్న ఎన్నికల్లో పెద్దపల్లిలో కాషాయజెండా ఎగరడం ఖాయమని నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమితులైన ముంబై వెస్ట్ ఎమ్మెల్యే నారాయణ అన్నారు. శనివారం పెద్దపల్లికి చేరిన నారాయణను బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు చిలారపు పర్వతాలు, జిల్లా అధికార ప్రతినిధి కట్కూరి సంపత్‌రెడ్డి, సంతోష్ సత్కరించారు. నియోజకవర్గవ్యాప్తంగా 10రోజుల పాటు పర్యటించి కేంద్రం అందిస్తున్న పథకాలను వివరిస్తూ ప్రజల మద్దతును కూడగడతామని పేర్కొన్నారు.

కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పని చేయాలి



మాట్లాడుతున్న తిరుపతియాదవ్

రామగిరి: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో నియోజకవర్గంలో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త పని చేయాలని మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతియాదవ్ సూచించారు. స్థానిక ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో శనివారం మండల కాంగ్రెస్ కార్యకర్తల క్లస్టర్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో క్లస్టర్ విధానాలను ఏర్పాటు చేసి బీఆర్‌ఎస్ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతి గ్రామంలో ప్రచారం చేయాలన్నారు. క్రమశిక్షణతో పార్టీలో కష్టపడే వారికి తగిన గుర్తింపు ఉంటుందని కలిసికట్టుగా ముందుకు సాగాలన్నారు. మండల అధ్యక్షుడు తోట చంద్రయ్య, యూత్ కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు బర్ల శ్రీనివాస్, ఎంపీటీసీలు చిందం మహేశ్, కొప్పుల గణపతి, పట్టణ అధ్యక్షుడు కాటం సత్యం, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మంథని రవీందర్, పబ్బతి రాధ, బండారి సదానందం, వనం రాంచందర్ రావు, కొట్టె సందీప్, సంపత్ పాల్గొన్నారు.

రామగిరి ఖిల్లాపై జెండా ఏర్పాటు



ఖిల్లాపై జెండా ఏర్పాటు చేసిన యువత

రామగిరి: మండలంలోని రత్నాపూర్ గ్రామానికి చెందిన యవకులు రామగిరిఖిల్లాపై కాషాయ జెండా ఎగురవేశారు. శ్రావణ మాసంలో పర్యాటకుల రద్దీ ఎక్కువగా ఉండటంతో ముందస్తుగా యువకులు ఖిల్లాకు వెళ్లే రహదారి వెంబడి ఉన్న చెట్లపొదలను తొలగించి ఖిల్లాకు వచ్చే పర్యాటకులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు. అనంతరం ఖిల్లాపై కాషాయ జెండా ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన బోగె ప్రకాశ్, బోగె నరేందర్, ముదుసు దీక్షిత్, పంజా బాలాజీ, బాలరాజు, చందు, అజయ్, రవి, ఉదయ్, సిద్దు ఉన్నారు.

ప్రపంచ మానవత్వ దినోత్సవం



శిబిరం నిర్వహిస్తున్న క్లబ్ ప్రతినిధులు

కోల్‌సిటీ: గోదావరిఖనిలో ప్రపంచ మానవత్వ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం రామగుండం లయన్స్ క్లబ్, మగువ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలతోపాటు పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక మార్కండేయ కాలనీలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో విద్యార్థులకు ఉచిత కంటి వైద్య శిబిరం రామగుండం లయన్స్ క్లబ్ ప్రతినిధులు నిర్వహించారు. లయన్స్ క్లబ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వారసంతలో అన్నదానం నిర్వహించారు. గోశాలలోని గోవులకు గ్రాసం, అరటిపండ్లు, బెల్లం పంపిణీ చేశారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం పురస్కరించుకొని సీనియర్ ఫొటోగ్రాఫర్ దబ్బెట శంకర్‌ను సన్మానించారు. స్థానిక జిల్లా పరిషత్ స్కూల్‌లో మగువ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత దంతవైద్య శిబిరం నిర్వహించారు. వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమాల్లో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు తానిపర్తి విజయలక్ష్మి, సెక్రటరీ బంక కళావతి, మగువ క్లబ్ అధ్యక్షురాలు లక్ష్మీవాణి, ప్రతినిధులు మేడిశెట్టి గంగాధర్, బంక రామస్వామి, తిలక్ చక్రవర్తి, పోకల ఆంజనేయులు, కజాంపురం జయప్రద, గుగ్గిళ్ల ఉమారాణి, పార్వతి, ఉమ పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో ఆశీర్వదించాలి



కార్మికులతో మాట్లాడుతున్న సత్యనారాయణ

గోదావరిఖని: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఆశీర్వదించి గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ కోరారు. శనివారం జీడీకే–5 ఓసీపీలో కార్మికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్న అనంతరం గేట్‌మీటింగ్‌లో మాట్లాడారు. రామగుండం నుంచి బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో ఉంటున్న తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. అనంతరం జీడీకే–7ఎల్‌ఈపీ గనిని సందర్శించి కార్మికులను కలిశారు. కార్యక్రమంలో నాయకులు వీరన్న, పిడుగు కృష్ణ, దీటి వెంకటస్వామి, మంచికట్ల భిక్షపతి, సోమారపు అరుణ్‌కుమార్, కోదాటి ప్రవీణ్ తదితరులున్నారు.

అసైన్డ్ భూములకు ఉచితంగా పట్టాలివ్వాలి



కలెక్టర్‌కు వివరిస్తున్న దాసరి ఉష

పెద్దపల్లిరూరల్: భూముల క్రమబద్ధీకరణ కోసం ప్రభుత్వం జీవో నెంబర్ 59 కింద దరఖాస్తులు స్వీకరించారని, అందులో ఉన్న పేదలకు ఉచితంగా భూములను క్రమబద్ధీకరించాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష కోరారు. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్ లాల్‌ను శనివారం కలిసి వినతిపత్రం అందించారు. ఎలిగేడు మండలానికి చెందిన పేదలు దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వానికి గుంటకి రెండు, మూడు రూ.లక్షల రుసుము చెల్లించాలని నోటీసులు జారీచేయడం సరికాదన్నారు. రుసుం చెల్లించకుంటే భూమి లాక్కుంటామని అధికారులు భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎలిగేడులోని సర్వేనెంబరు 870లో ఉన్న భూమి మార్కెట్ విలువను ఏ పద్ధతిన నిర్ధేశించారో చెప్పాలని కోరారు. నాయకులు బాబు, కుమ్మరి సవిత, ఎండీ రియాజ్, కల్వల శోభ, ఓం ప్రకాష్, ఎండీ సాదిక్ పాల్గొన్నారు.

బీఎస్పీని ప్రజలు అక్కున చేర్చుకుంటున్నారు

కాల్వశ్రీరాంపూర్: బీఎస్పీ పార్టీని నియోజకవర్గ ప్రజలు అక్కున చేర్చుకుంటున్నారని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష అన్నారు. మండలంలోని పెద్దరాతుపల్లి, చిన్నరాతుపల్లి, ఇదులాపూర్ గ్రామాల్లో శనివారం 'మన ఊరు–మన ఉషక్క' కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుంటూ వివరాలు సేకరించారు. జిల్లా నాయకుడు రియాజ్, మండల అధ్యక్షుడు కుమ్మరికుంట రవికుమార్, మహిళా అధ్యక్షురాలు శారద, నాయకులు పల్లె ప్రశాంత్, సీపెల్లి కొమురయ్య, చంద్రశేఖర్, బండారి సదానందం, రాజేశం, నిఖిల్‌గౌడ్, తులసీరామ్, రాహుల్, నాగరాజు పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో పోస్టుపై కేసు నమోదు



ఫిర్యాదు చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

జ్యోతినగర్: రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌పై సోషల్ మీడియాలో ఫొటోలు మార్ఫింగ్ చేసి తప్పుడు ఆరోపణలు చేస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ నాయకులు ఫిర్యాదు చేసిన క్రమంలో శనివారం ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్‌లో బీజేపీ నాయకుడిపై కేసు నమోదైంది. వివరాలిలా ఉన్నాయి. గోదావరిఖనికి చెందిన బీజేపీ నాయకుడు పిడుగు కృష్ణ రామగుండం ఎమ్మెల్యే చందర్ ఫొటోలు మార్ఫింగ్ చేసి పలు ఆరోపణలు చేస్తూ రెచ్చగొట్టేలా పోస్టులు పెడుతున్న క్రమంలో చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ ఎన్టీపీసీ పట్టణ కమిటీ ప్రధాన కార్యదర్శి బుర్ర శంకర్‌గౌడ్ రామగుండం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో, ఎన్టీపీసీ ఎస్సై బి.జీవన్‌కు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. యువజన విభాగం అధికార ప్రతినిధి ఈదునూరి అశోక్, ఎల్కలపల్లి మాజీ సర్పంచ్ పల్లె శ్రీనివాస్‌యాదవ్, అధికార ప్రతినిధులు ఈదునూరి శంకర్, పొన్నం విజయ్‌గౌడ్, సమన్వయ కమిటీ సభ్యులు కుసుమ వెంకటేశ్, ఒల్లాల మల్లేశ్, సంపత్ చౌదరి, రామగుండం పట్టణ కమిటీ అధ్యక్షులు బొడ్డుపల్లి శ్రీనివాస్, ఇనపల్లి తిరుపతి ఉన్నారు.

ఎమ్మెల్యేపై అసత్య ఆరోపణలు చేసిన వ్యక్తిపై ఫిర్యాదు

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌పై అసత్యపు ఆరోపణలు చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కాలనీ బీఆర్‌ఎస్ నాయకులు శనివారం గోదావరిఖని టూటౌన్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. నాయకులు మాట్లాడుతూ ఓ వాట్సాప్ గ్రూపులో ఎమ్మెల్యేపై తప్పుడు ఆరోపణలు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. పోస్ట్ పెట్టిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు మేడి సదయ్య, పులి రాకేశ్, బాలరాజు, దామోదర్, రాంచందర్, కుమార్ నాయక్, ప్రశాంత్, రాజమౌళి, మధు, మొగిలి, రాజయ్య పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్య సంరక్షణపై దృష్టిసారించాలి



మాట్లాడుతున్న సీడీపీవో స్వరూపరాణి

రామగుండం: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న చిన్నారుల ఆరోగ్య సంరక్షణపై కేంద్రాల నిర్వాహకులు ప్రత్యేక దృష్టిసారించాలని సీడీపీవో గండ్ల స్వరూపరాణి అన్నారు. ఈ మేరకు శనివారం అంతర్గాం మండల కేంద్రంలోని రైతుభవన్‌లో పాలకుర్తి, అంతర్గాం మండలాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించి చిన్నారుల ఆరోగ్య సంరక్షణ, గర్భిణులపై ప్రత్యేక దృష్టి తదితర అంశాలపై కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్స్ విష్ణుప్రియ, పుష్పలత, అంజలి, సువర్ణ, అంగన్‌వాడీ కార్యకర్తలు హాజరయ్యారు.

మహాసభల ప్రచార రథం ప్రారంభం

గోదావరిఖని: ఏఐటీయూసీ 16వ కేంద్ర మహాసభలు పురస్కరించుకుని శనివారం ప్రజానాట్యమండలి ప్రచారరథాన్ని శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు రంగు శ్రీనివాస్, బండి మల్లేశ్, బలుసు రవి, రమేశ్‌గౌడ్, దొంత సాయన్న, ప్రచార రథం వెంట ఉన్న ప్రజానాట్యమండలి కళాకారులు ఎజ్జ రాజయ్య, ఆసాల రమ, జాలిగం రాజు, పానుగంటి రవి, మోహన్ తదితరులు మహాసభల చైతన్య గేయాలను ఆలపించారు.

మంథని సంఘం నుంచి రూ.1.99కోట్ల రుణమాఫీ

మంథని: ప్రభుత్వం నిర్దేశించిన సమయంలో మంథని సహకార సంఘంలో 826 మంది రైతులు రూ.లక్ష లోపు రూ.4,87,74,088 రుణాలు పొందినట్లు ఉన్నతాధికారులకు నివేదించగా ఇప్పటి వరకు సంఘంలోని 408 మందికి గాను 1.99కోట్లు రుణమాఫీ అయినట్లు సింగిల్‌విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ తెలిపారు. శనివారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రూ.లక్ష లోపు 418 మందికి గాను రూ.2.88 కోట్లు జమ కావాల్సి ఉందన్నారు.